అదృశ్యమైన బాలిక.. తల్లిదండ్రుల చెంతకు

● కేసును 9 గంటల్లోపు ఛేదించిన పోలీసులు
● నిందితుడిపై పోక్సో కేసు ● అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన బాలికను తల్లిదండ్రుల చెంతకు చేర్చారు పోలీసులు. ఈ కేసును 9 గంటల్లోపు పోలీసులు ఛేదించారు. లైంగిక దాడికి యత్నించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం... మల్కాజిగిరి ప్రాంతంలో నివాసముంటున్న దంపతుల కుమార్తె మెదక్‌లో అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసింది. కాగా తల్లిదండ్రుల వద్దకు బయలుదేరింది. జూబ్లీ బస్టాండ్‌కు చేరుకున్న బాలికను మెదక్‌లో పరిచయమైన యువకుడు మాయమాటలు చెప్పి తన వెంట తీసుకెళ్లాడు. ఎంతకీ యువతి ఇంటికి చేరకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు తమకు లభించిన సీసీ ఫుటేజీని తల్లిదండ్రులకు చూపించారు. వారిచ్చిన సమాచారంతో మెదక్ సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు. స్నాప్‌చాట్‌లో అతడి ప్రొఫైల్ వివరాలు సేకరించారు. ఆ గ్రామ సర్పంచ్‌ను సంప్రదించి యువకుడి బాబాయ్ సెల్ నంబర్ తీసుకున్నారు. కాల్ చేసి యువకుడు వద్ద ఉన్న మొబైల్ నంబర్ అనంతరం దమ్మాయిగూడలో బాలిక ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. వెంటనే అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా తనపై అత్యాచార యత్నానికి ప్రయత్నించాడని బాలిక వారికి తెలిపింది. దీంతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. ఆపై అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే కేసును 9 గంటల వ్యవధిలోనే ఛేదించిన మారేడ్‌పల్లి పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రాలపై దాడి

● 150 కిలోలు స్వాధీనం ● మరో 40 కిలోలు మూసీలో పారబోత



కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న ఇంటి వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు

చాదర్‌ఘాట్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చాదర్‌ఘాట్‌లోని రసూల్‌పుర, వినాయకవీధి బస్తీల్లో కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేస్తున్న కేంద్రాలపై సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, జీహెచ్‌ఎంసీ ఫుడ్‌సేఫ్టీ అధికారుల శనివారం సాయంత్రం దాడులు నిర్వహించారు. 150 కిలోల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకుని, 40 కిలోల కల్తీ పేస్ట్ వరకు మూసీ నదిలో పారబోశారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఈ దాడులు చేశారు. బీహార్ రాష్ట్రానికి చెందిన రేణుక(35) కుటుంబీకులతో మూసీ పరీవాహక ప్రాంతమైన చాదర్‌ఘాట్ రసూల్‌పుర, వినాయక వీధిలో ఇంటిని అద్దెకు తీసుకుని కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను తయారు చేస్తూ, నగరంలో అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నట్లు, తయారీ కేంద్రాలకు ఎలాంటి అనుమతులు, ఫుడ్ సేఫ్టీ పర్మిషన్లు లేవని అధికారులు తేల్చారు. దీంతో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్ నిర్వాహకురాలైన రేణుకపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంటిని అద్దెకు ఇచ్చిన యాజమానిపై కూడా చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంవత్సరం చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కల్తీ అల్లం వెల్లుల్లి తయారీ కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫుడ్‌సేఫ్టీ అధికారులతో కలిసి దాడులు చేయడం ఇది రెండోసారి.

అంగన్‌వాడీ కేంద్రానికి స్థలం కేటాయించండి

సైదాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్ శంకేశ్వర్‌బజార్ బస్తీలో ప్రభుత్వ స్వాధీనంలో ఉన్న ఖాళీ స్థలం అంగన్‌వాడీ భవన నిర్మాణానికి కేటాయించాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవిందర్ రెడ్డి శనివారం మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. సైదాబాద్ జువైనల్ హోంలో డి- అడిక్షన్ ప్రారంభోత్సవానికి వచ్చిన మంత్రిని వారు కలిశారు. శంకేశ్వర్‌బజార్ బస్తీలో అద్దెభవనంలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. కనీస సౌకర్యాలు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సూరజ్, శివశంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ బడంగ్‌పేట్ చైర్మన్‌గా కుమార్

సరూర్‌నగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎస్సీ సెల్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బొల్లపల్లి కుమార్‌స్వామి నియమితులయ్యారు. ఈ మేరకు సెల్ మహేశ్వరం నియోజకవర్గం చైర్మన్ క్యారగారి శ్రీధర్ జారీ చేసిన నియామక పత్రాన్ని శనివారం పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ కుమార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి, ఎస్సీ సెల్ నాయకుడు బాల్‌నింగని జంగయ్య, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, సంతోష్‌శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, పార్టీ నాయకులు గట్టు బాలకృష్ణ, సూర్ణగంటి విజయ్‌కుమార్, భాను తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్ టికెట్ల పేరుతో రూ.7.71 లక్షల మోసం

పంజాగుట్ట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ట్రావెల్ టికెట్ల పేరుతో ఓ నృత్య కళాకారిణిని ట్రావెల్ ఏజెంట్ మోసగించాడు. ఈ సంఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. గతేడాది ఏప్రిల్‌లో తన బృందంతో కలిసి బాలీ వెళ్లేందుకు ఢిల్లీకి చెందిన ట్రావెల్ ఏజెంట్ మోహిత్‌ను బేగంపేట.. కుందన్‌బాగ్‌కు చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి సంప్రదించింది. విమానం టికెట్ల కోసం రూ.7.71 లక్షలు అతనికి ఇచ్చింది. రోజులు గడుస్తున్నా టికెట్లు ఇవ్వకపోగా చుట్టూ తిప్పించుకుంటున్నాడు. దీంతో నిలదీస్తే అతని నుంచి ఎలాంటి సమాధానం లేదు. ఈ మేరకు ఆమె శనివారం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భవనం పై నుంచి పడి సెంట్రింగ్ కార్మికుడి మృతి

హయత్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నాలుగంతస్తుల భవనంపై నుంచి జారీ పడి సెంట్రింగ్ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మీర్‌పేట్ నందనవనం కాలనీలో నివాసం ఉండే నడ్డి నరసింహ(55) సెంట్రింగ్ కార్మికుడు. శనివారం హయత్‌నగర్ డివిజన్‌లోని ఇన్ఫర్‌మేషన్ కాలనీలో ఓ నాలుగంతస్తుల భవనానికి సెంట్రింగ్ చెక్క కొట్టడానికి పనికి వచ్చాడు. ఉదయం 8 గంటల సమయంలో ప్రమాదవశాత్తు నరింహ నాలుగో అంతస్తు పై నుంచి జారీ కింద పడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు హరిసింగ్‌నాయక్, సక్రునాయక్, ప్రసాద్‌తో పలువురు అక్కడికి చేరుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని భవనం యజమానికి కోరారు. హయత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీతం కోసం వెళ్లిన గృహిణి అదృశ్యం



గుటీ దేవి

మన్సూరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇదివరకు పనిచేసిన షాపులో రావాల్సిన వేతన డబ్బులు తెచ్చుకుంటానని ఇంటి నుంచి బయటకు వెళ్లిన గృహిణి అదృశ్యమైంది. ఈ ఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఖాన్‌పూర్‌నగర్ జిల్లా బిచ్చిపూర్‌కు చెందిన చరణ్‌సింగ్ నాగోల్ డివిజన్ మమతానగర్‌లోని సరస్వతి మార్బుల్ షాపులో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ తన భార్య గుటీ దేవి(35)తో కలిసి అదే షాపులో నివాసముంటున్నాడు. అతడి భార్య గుటీ దేవి ఫత్తుల్లాగూడలోని గీతాంజలి హ్యాండ్లూమ్‌లో రెండేళ్లుగా పనిచేంది. ప్రస్తుతం అక్కడ పని లేకపోవడంతో ఇంట్లోనే ఉంటుంది. కాగా తాను పనిచేసిన దుకాణంలో కొంత డబ్బు రావాల్సి ఉండగా శుక్రవారం ఉదయం 9.30లకు అట్టి డబ్బును తెచ్చుకుంటానని వెళ్లింది. భార్య వెళ్లి 3గంటలు దాటినా ఇంకా రాకపోవడంతో చరణ్‌సింగ్ ఆమెకు ఫోన్‌చేయగా వస్తున్నానని చెప్పింది. అయినా రాకపోవడంతో మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో సదరు దుకాణానికి ఫోన్ చేసి ఆరాతీయగా ఇక్కడికి రాలేదంటూ వారు చెప్పారు. ఈ మేరకు నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే ప్రభుత్వ లక్ష్యం

● దశలవారీగా అన్ని హోంలలో డీ-అడిక్షన్ సెంటర్ల ఏర్పాటు ● మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



డ్రగ్స్ డీ-అడిక్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

సైదాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సాధికారత శాఖ ఆధ్వర్యంలో సైదాబాద్‌లోని జువెనైల్ శాఖ రాష్ట్ర కార్యాలయం(తెలంగాణ జువెనైల్ వెల్ఫేర్ కరెక్షనల్ సర్వీసెస్, వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్ డిపార్ట్‌మెంట్)లో పైలెట్ ప్రాజెక్టు కింద రూ.13.80లక్షలతో ఏర్పాటు చేసిన డ్రగ్ డీ- అడిక్షన్ సెంటర్‌ను శనివారం మంత్రి సీతక్క ప్రారంభించారు. పిల్లల్లో పెరుగుతున్న డ్రగ్స్ గంజాయి వినియోగం సమాజంపై వినాశకరమైన ప్రభావాన్ని చూపుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం హోంలో 16 మంది బాలలకు డీ- అడిక్షన్ సెంటర్‌లో మానసిక నిపుణుల ద్వారా కౌన్సెలింగ్, వైద్యచికిత్స, ఇతర సేవలు అందించనున్నామని వివరించారు. దశలవారీగా రాష్ట్రంలో అన్ని హోంలలో డీ-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో సైదాబాద్ కార్పొరేటర్ అరుణారెడ్డి, మహిళ శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి అనితారామచంద్రన్, డైరక్టర్ నిర్మలాకాంతి వెస్లీ, దివ్యాంగుల, వృద్ధుల సాధికార శాఖ డైరెక్టర్ శైలజ, జువెనైల్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చారువాక్, ఏసీపీ ఎస్ నవీన్, హోం సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్య నివారణకు కూడళ్ల విస్తరణ



చౌరస్తాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి, అధికారులు

మన్సూరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్యను దృష్టిలో పెట్టుకుని మన్సూరాబాద్‌లోని ప్రతి ప్రధానకూడలిని విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలను ప్రధానంగా తలెత్తే కామినేని చౌరస్తా, మన్సూరాబాద్ చౌరస్తా, పెద్దచెరువు వెళ్లే చౌరస్తా, శ్రీరామ్‌నగర్ కాలనీ చౌరస్తా, కుమ్మరిబస్తీ రోడ్, కామునికాంత చౌరస్తాను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ అధిక మొత్తంలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తి నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇట్టి విషయమై మేయర్ గద్వాల విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ప్రత్యేక చొరవతో కూడళ్ల విస్తరణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ శాఖ ఈఈ రమేష్‌బాబు, డీఈ కనకయ్య, ఏఈ స్వప్న, డబ్బ్యాబ సీతారాం, బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, భీమనపల్లి సిద్ధు తదితరులు ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

టీపీసీసీ ప్రచారకమిటీ కోకన్వీనర్ శ్రీనివాస్ గుప్తా

మన్సూరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని ఆలయాలను అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతోందని టీపీసీసీ ప్రచారకమిటీ కోకన్వీనర్, ఐవీఎఫ్ జాతీయ కార్య నిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ జైపురికాలనీలోని శ్రీషిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన హోమం, ఇతర పూజాది కార్యక్రమాలలో ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఉప్పల సాయికిరణ్ గుప్తా, ఉప్పల శర్వరి దంపతులు ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొలను వెంకట్‌రెడ్డి, కార్యదర్శి కొరవి జంగయ్యగుప్తా, కోశాధికారి రావుల రంజిత్‌గౌడ్, వైస్‌చైర్మన్ వెంకటరమణగౌడ్, బద్దం మోహన్‌రెడ్డి, వ్యవస్థాపక అధ్యక్షుడు రాములుగౌడ్, జగన్‌గుప్తా, సోమయ్య, భక్తులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

హయత్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 22వ వార్డులో రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను శనివారం సాయంత్రం కమ్మగూడ 22వ వార్డు మాజీ కౌన్సిలర్ కౌశిక ఐలయ్య ప్రారంభించారు. సాగర్ రహదారి నుంచి వెంకటేశ్వరనగర్ కాలనీ, సాయినగర్ కాలనీ, సాయి ప్రియనగర్ కాలనీ, శివాజీనగర్ కాలనీ-1, 2, కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయం మీదుగా తొర్రూర్ హెచ్‌ఎండీఏ లేఅవుట్ వరకు సుమారు 2 కిలో మీటర్ల దూరం రోడ్డు నిర్మిస్తున్నట్లు ఐలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీల అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్, భాస్కర్‌రెడ్డి, శంకర్, వెంకట్రావ్, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

రెండో రోజు 9 మంది గైర్హాజరు

ఎల్‌బీనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రెండో రోజూ ప్రశాంతంగా కొనసాగాయి. సరూర్‌నగర్ మండలం పరిధిలోని 45 పరీక్ష కేంద్రాల్లో శనివారం 9,094 మంది విద్యార్థులకు గాను 9,085 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొమ్మిది మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ బసునాయక్ తెలిపారు.

నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

టీజీపీసీబీ ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు



ప్రపంచ నీటి వనరుల దినోత్సవంలో పాల్గొన్న అతిథులు



ప్రతిజ్ఞ చేస్తున్న వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, భావన శ్రీనివాస్

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నీటిని సంరక్షించడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ప్రాజెక్టు అధికారి నాగేశ్వరరావు సూచించారు. ప్రపంచ నీటి వనరుల దినోత్సవం సందర్భంగా శనివారం దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్ ల్యాప్ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. నీటి సంరక్షణ ప్రాముఖ్యత, నీటి వనరుల స్థిరమైన నిర్వహణ గురించి అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కాపాడుకోవడంలో నీటి పాత్ర ఎంతో ఉందన్నారు. మనిషి 'జీవితానికి నీరు చాలా అవసరమని, భవిష్యత్ తరాల కోసం దానిని సంరక్షించడం మన బాధ్యతగా భావించాలని విజ్ఞప్తి చేశారు. నీటి కాలుష్యాన్ని తగ్గించడం, నీటి వనరులను రక్షించడం, వర్షపు నీటిసేకరణ, నీటి శుద్ధి, రీసైక్లింగ్, చెట్ల పెంపకం వంటి పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నీటి వనరులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి అన్ని దేశాలు సమిష్టిగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ భవాని, పర్యావరణవేత్త రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జలవనరులను పొదుపుగా వాడుకోవాలి: సీఐ

వనస్థలిపురం: జలవనరులు పొదుపుగా వాడుకోవాలనీ వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా సామాజిక కార్యకర్తల ఆధ్వర్యంలో శనివారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రినగర్ బ్యాంక్ కాలనీ, వెంకటేశ్వర కాలనీల వద్ద ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రం, మజ్జిగ కేంద్రాన్ని ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు భావన శ్రీనివాస్, పి.కృష్ణ, యాదగిరి రావు, వంశీకృష్ణ, సురేందర్, లక్ష్మీశ్రీ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఏజీపీగా విజయకుమారి



విజయకుమారిని సన్మానిస్తున్న రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు: రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న విజయకుమారి తెలంగాణ హైకోర్టు ఏజీపీగా నియమితులయ్యారు. విష్ణు పోలె ఏఏజీపీగా నియమితులయ్యారు. విజయకుమారి మూడు సంవత్సరాల పాటు ఏజీపీగా కొనసాగనున్నారు. విజయకుమారి, విష్ణు పోలెను జిల్లా కోర్టు న్యాయవాదులు రమణారావు, పొన్నం దేవరాజ్, సత్యనారాయణరెడ్డి, లింగస్వామి సన్మానించారు.

నిరుపేద ఆర్యవైశ్య వృద్ధులకు ప్రతినెలా పింఛన్

రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనారాయణ



జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

చంపాపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లాలోని నిరుపేద ఆర్యవైశ్య కుటుంబంలో వృద్ధులకు ప్రతినెలా పెన్షన్లు అందించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య మహాసభ తొలి కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు గందె సురేష్ అధ్యక్షతన శనివారం చంపాపేట డివిజన్ మందమల్లమ్మ చౌరస్తా ఇన్నర్ రింగ్‌రోడ్‌లోని శ్రీలక్ష్మీకన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడుతూ జిల్లాలో ప్రతి నెలా 50మంది నిరుపేదలకు పెన్షన్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మండలాల వారీగా అర్హులైన వారి వివరాలను సేకరించి కమిటీ ద్వారా నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎంపికైన వారికి హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే కార్యక్రమంలో పెన్షన్లు నేరుగా అందిస్తామని, మిగతావారికి నెలనెలా పెన్షన్లు వారి బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభలో ఉంటూ మహాసభకు సంబంధం లేని సభలకు వెళ్లవద్దని సభ్యులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా, రాష్ట్ర పొలిటికల్ చైర్మన్ చింతల రవికుమార్‌గుప్తా, రాష్ట్ర నాయకులు పసునూని శ్రీనివాస్‌గుప్తా, రాష్ట్ర అవోపా అధ్యక్షుడు మలిపెద్ది శంకర్‌గుప్తా, మాజీ జిల్లా అధ్యక్షుడు అర్థం లక్ష్మయ్యగుప్తా, జిల్లాకోశాధికారి బద్రీనాథ్‌గుప్తా, జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షుడు మహేష్‌గుప్తా పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై స్పీకర్, డీజీపీకి ఫిర్యాదు



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు

చంపాపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై తగిన చర్యలు తీసుకోవాలని శనివారం గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర లక్‌పతి నాయక్ ఆధ్వర్యంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. సదరు ఎమ్మెల్యేను అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీ కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాబురామ్‌నాయక్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటి డైరెక్టర్ గణేష్‌నాయక్, నేతలు రాజు రాథోడ్, లక్ష్మణ్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అధికారుల తీరుపై వైస్‌చైర్మన్ ఆగ్రహం

సైదాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో శిథిలావస్థలో ఉన్న షెడ్లు కూలితే బాధ్యత ఎవరు వహిస్తారని హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ మార్కెటింగ్ శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మాదన్నపేట మార్కెట్ బురదమయంగా మారడంతో రైతులు, వ్యాపారులు ఫిర్యాదు చేయడంతో శనివారం ఉదయం మార్కెట్‌లో పర్యటించారు. కూలిపోయే షెడ్డులో గత్యంతరం లేక ఆకుకూరల వ్యాపారం చేస్తున్నామని మహిళలు అవేదన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షం వచ్చినా వ్యర్థాలతో మార్కెట్ దుర్గంధంగా మారుతుందని రైతులు వివరించారు. మార్కెట్‌లో అర్ధరాత్రి వేళలలో జీరో వ్యాపారాలు సాగుతున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇందుకు స్పందించిన వైస్‌చైర్మన్ త్వరలోనే పాలకవర్గం సమావేశంలో మాదన్నపేట మార్కెట్ సమస్యలు చర్చించి పటిష్టచర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు.

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

● పైలెట్ ప్రాజెక్టు కింద 17 ఎస్ఆర్‌వోలు ఎంపిక

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు(ఎస్ఆర్‌వో)ల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ భావిస్తోంది. ఉగాదిలోగా పైలెట్ ప్రాజెక్టు కింద 17 ఆఫీసుల్లో ఈ విధానాన్ని ప్రారంభించాలని సన్నాహాలు చేస్తోంది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 148 ఎస్ఆర్‌వోల్లో ఈ విధానాన్ని తీసుకురానున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆరు ఎస్ఆర్‌వోలను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలోని చిక్కడపల్లి, ఆజంపురా, రంగారెడ్డి జిల్లాలోని ప్రాంతీయ కార్యాలయం(ఆర్‌ఓ), శంషాబాద్.. మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్, మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో ఉగాది నుంచి రోజుకు 48 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగేలా వినియోగదారులకు 48 టైమ్ స్లాట్లను అందుబాటులోకి తేనున్నారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చలానాలను ఆన్‌లైన్‌లోనే చెల్లించి ఆ డాక్యుమెంట్లు ప్రింట్ తీసుకుని ఎస్ఆర్‌వోకు వెళితే 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అయితే సంతకాలకు బదులు ఎలక్ట్రానిక్ సిగ్నేచర్ పద్ధతిని అవలంబించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

అల్మాస్‌గూడ-గుర్రంగూడ రోడ్డు బాగుచేయండి

సరూర్‌నగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ-గుర్రంగూడ శివాలయం మలుపు రోడ్డు అధ్వానంగా మారినందున దానిని వెంటనే బాగు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నవారు మల్లారెడ్డి పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌ను కోరారు. ఈ మేరకు శనివారం పలు కాలనీల ప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి ఆయనకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి.గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నాయకులు డి.శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, కాలనీల ప్రతినిధులు వెంకటేశ గౌడ్, లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

'ఆ అగంతకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి'

వనస్థలిపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తన ఇంటిపై రెక్కీ నిర్వహించిన అగంతకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ నేత రావి నూతల శశిధర్ పోలీసులను కోరారు. ఈ మేరకు శనివారం వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనకు రక్షణ కల్పించాలని రాచకొండ సీపీకి వినతి పత్రం అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఇంటర్నేషనల్ ఉమెన్స్ మంత్ వేడుకలు

మన్సూరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ ఉమెన్స్ మంత్ వేడుకలను నాగోల్ డివిజన్ ఇంద్రప్రస్థ కాలనీరోడ్ నంబర్ 5లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నట్లు కాలనీ మహిళా విభాగం సభ్యురాలు, హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ కాలంశెట్టి లయ పేర్కొన్నారు. ఇంద్రప్రస్థకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా వింగ్ ఆధ్వర్యంలో చేపట్టే ఈ వేడుకల్లో పాల్గొనేందుకు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఫోన్ 9866618867 నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

'హమాలీలకు శ్రమకు తగిన వేతనం ఇప్పించండి'

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నగర శివారు బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలకు శ్రమకు తగిన వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీర్ హరిసింగ్‌నాయక్ ఆధ్వర్యంలో శనివారం గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు నరసింహ, చిన్నగౌడ్, షరీఫ్, పోశయ్య, శంకర్‌నాయక్, నిరంజన్, మల్లేష్, ఇమ్రాన్ పాల్గొన్నారు.